క్లుప్తంగా

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



నర్సంపేట రూరల్ : యోగా సాధనతో సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని ఆయుష్ శాఖ వైద్యురాలు హైమావతి, హోమియో వైద్యాధికారి శ్రీదేవి తెలిపారు. యోగా దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా నర్సంపేట ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి ఆవరణలోని ఆయుష్ ఆస్పత్రి ఆధ్వర్యంలో చిన్నారులకు, వృద్ధులకు శుక్రవారం యోగాపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా హైమావతి, శ్రీదేవి మాట్లాడారు. రోజూ యోగా చేయడం ద్వారా శారీరక దృఢత్వం, మానసిక ప్రశాంతత పొందవచ్చని తెలిపారు. సమాజంలోని ప్రతిఒక్కరూ రోజూ యోగా చేయటానికి సమయం కేటాయించాలని సూచించారు. కార్యక్రమంలో హోమియోపతి ఆస్పత్రి ఉద్యోగి ఉమామహేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత



వర్ధన్నపేట : పట్టణంలోని రెండో వార్డుకు చెందిన వడ్లకొండ సాయిచరణ్ ఇటీవల లివర్ సంబంధిత వ్యాధితో బాధపడుతూ మృతి చెందగా బాధిత కుటుంబానికి ప్రభుత్వం నుంచి మంజూరైన రూ.6 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కును వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు హనుమకొండలోని తన క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం అందజేశారు. తొలుత బాధిత కుటుంబాన్ని ఎమ్మెల్యే పరామర్శించారు. సాయిచరణ్‌ను ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్చి రూ.45 లక్షలు ఖర్చు చేసినా ప్రాణాలు దక్కకపోవడం బాధాకరమన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ కమిటీ అధ్యక్షుడు మైస సురేశ్, నాయకులు అనిమిరెడ్డి కృష్ణారెడ్డి, కిశోర్, సమ్మెట సుధీర్, మంచాల రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

అన్నారం దర్గాలో పూజలు



పర్వతగిరి : వర్ధన్నపేట మండలంలోని వెన్నారం గ్రామానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త, పీహెచ్‌సీ ప్రైవేటు ప్రాజెక్టు లిమిటెడ్ చైర్మన్ పడిదల నవీన్‌కుమార్ పర్వతగిరి మండలంలోని అన్నారం యాకూబ్ షావలీ దర్గాలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. తొలుత ఆయన చాదర్ సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన్ను యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కందికట్ల అనిల్ శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి భూక్య విజేందర్‌నాయక్, నాయకులు చిన్నపాక శ్రీనివాస్, లకావత్ నవీన్, విజేందర్‌రెడ్డి, నవీన్, రంజిత్, కుమార్, తదితరులు పాల్గొన్నారు.

చర్చిలో యూత్ ఫెస్టివల్



వర్ధన్నపేట : పట్టణంలో ఎస్‌బీసీజీఓ చర్చిలో శుక్రవారం యూత్ ఫెస్టివల్ నిర్వహించారు. ఈ సందర్భంగా మినిస్ట్రీ యూత్ వక్తలు అభిషేక్ చాకో, జెర్మియా ఫెబ్, థామస్, టామ్ అతిథులుగా హాజరు కాగా పాస్టర్ రెవరెండ్ ఇమ్మడి ఆంధ్రయ్య మాట్లాడారు. యువత క్రీస్తు మార్గంలో పయనించి జీవితాన్ని ఉన్నతంగా తీర్చిదిద్దుకోవాలని ఆకాంక్షించారు. యువత దేశాభివృద్ధి దిశగా ఉన్నత లక్ష్యాలను ఎంచుకుని విలువలతో కూడిన విద్య అభ్యసించాలని సూచించారు. మద్యపానం, సిగరెట్, గుట్కా, డ్రగ్స్ వంటి దురలవాట్లకు దూరంగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో కొండేటి వెంకటేశ్వర్లు, సిలువేరు ఆనందం, కొండేటి కుమారస్వామి, గాయాల సుమన్, కొండేటి దీవెన్, టైసన్, సతీశ్ పాల్, అభిలాశ్, తదిరులు పాల్గొన్నారు.

రేపు ఆలయంలో వార్షికోత్సవ పూజలు



నల్లబెల్లి : మండల కేంద్రంలోని శ్రీరాజరాజేశ్వర స్వామి ఆలయంలో రేపు (జూన్ 1న) ఆలయ ద్వితీయ వార్షికోత్సవ పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ ట్రస్ట్ చైర్మన్ తాటిపెల్లి రవీందర్, ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు గందె శ్రీనివాస్ గుప్తా తెలిపారు. మండల కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉదయం ధ్వజారోహణం, రుద్రాభిషేకం, రుద్ర హోమం, పార్వతీ పరమేశ్వరుల కల్యాణం, మహాఅన్నదానం, స్వామి వారి ఊరేగింపు కార్యక్రమాలు ఉంటాయని వివరించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

విలీన గ్రామాల్లో విచిత్ర కష్టాలు

- పోలీస్, వైద్య శాఖల విలీనంలో నిర్లక్ష్యం

నర్సంపేట రూరల్ : గ్రామాల్లో రోడ్లు, డ్రైనేజీ, తాగునీటి, ఇతర సమస్యలు ఉండడం పరిపాటి. కాగా నర్సంపేట మండలంలో విలీనమైన చెన్నారావుపేట మండలంలోని గ్రామాల్లో ప్రజలు విచిత్రమైన కష్టాలు ఎదుర్కొంటున్నారు. పోలీస్, వైద్య శాఖల విలీనంలో ప్రభుత్వం, అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

రాష్ట్ర ప్రభుత్వం జిల్లాల, మండలాల పునర్వ్యవస్థీకరణలో భాగంగా చెన్నారావుపేట మండలంలోని గురిజాల, జీజీఆర్‌పల్లి, ముగ్దుంపురం, పాత ముగ్దుంపురం గ్రామాలను నర్సంపేట మండలంలో విలీనం చేస్తూ 2016–17 సంవత్సరంలో జీఓ జారీ చేసిన విషయం తెలిసిందే. అనంతరం 2018లో తండాలను గ్రామపంచాయతీలుగా మార్చే క్రమంలో గురిజాల నుంచి గుంటూరుపల్లి, జీజీఆర్‌పల్లి నుంచి చిన్న గురిజాల గ్రామాలను వేరు చేయడంతో ఆరు గ్రామ పంచాయతీలుగా మారాయి. నర్సంపేట మండలంలో సదరు ఆరు గ్రామ పంచాయతీలు కలపగానే తొలుత రెవెన్యూ, పశు వైద్యశాల, ఐకేపీ, అంగన్‌వాడీ, విద్య, వ్యవసాయ శాఖలు నర్సంపేట మండలంలో కలిపారు. 2019 సర్పంచ్, ఎంపీటీసీ ఎన్నికల అనంతరం మండల పరిషత్, ఈజీఎస్, వాటర్ గ్రిడ్ శాఖ, తదనంతరం విద్యుత్ శాఖను నర్సంపేట మండలంలో కలిపారు. ఇప్పటివరకు వైద్యఆరోగ్య, పోలీస్ శాఖలను నర్సంపేటలో విలీనం చేయలేదు. ఈ రెండు శాఖలు ముఖ్యమైనవి కావడంతో



పాత ముగ్దుంపురం గ్రామపంచాయతీ కార్యాలయం

ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. ఏవైనా సమస్యలు తలెత్తితే రెండు మండలాల చుట్టూ ప్రదక్షిణ చేయాల్సిన దుస్థితి నెలకొంది. చెన్నారావుపేట మండలం నుంచి అన్ని శాఖలను నర్సంపేట మండలంలో విలీనం చేసేలా స్థానిక ఎమ్మెల్యే, జిల్లా కలెక్టర్ చొరవ తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఇటు రెవెన్యూ.. అటు పోలీస్ శాఖలు

2016–17లో చెన్నారావుపేట మండలం నుంచి నర్సంపేట మండలంలో నాలుగు గ్రామాలు విలీనమయ్యాయి. కాగా దశలవారీగా పలు ప్రభుత్వ శాఖలు నర్సంపేట మండలంలోకి మారాయి. కాగా తొమ్మిదేళ్లుగా వైద్య ఆరోగ్య, పోలీస్ శాఖలు చెన్నారావుపేటలోనే కొనసాగుతున్నాయి. దీంతో సదరు గ్రామాల్లో భూసమస్యలు తలెత్తితే రైతులు, ప్రజలు నర్సంపేట మండలానికి వస్తున్నారు. భూసమస్యల్లో గొడవలు చోటు చేసుకుంటే చెన్నారావుపేట పోలీస్‌స్టేషన్‌కు వెళ్లాల్సి వస్తోంది. ఈ క్రమంలో సమస్య తలెత్తినా, అధికారుల నుంచి సమాచారం తీసుకోవాల్సి వచ్చినా ప్రజలు రెండు మండలాల చుట్టు ప్రదక్షిణ చేయక తప్పని విచిత్ర పరిస్థితి నెలకొంది.అన్ని శాఖలను నర్సంపేట మండలంలోనే విలీనం చేయాలన్న డిమాండ్‌ను ప్రభుత్వం, జిల్లా ఉన్నతాధికారులు పట్టించుకోవడం లేదంటూ ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ ఉన్నతాధికారులు స్పందించి సమస్యను త్వరితగతిన పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

సేంద్రియ సాగుతో అధిక దిగుబడి



రాయపర్తి : కరపత్రాలు ప్రదర్శిస్తున్న శాస్త్రవేత్తలు



ఖానాపురం: మాట్లాడుతున్న శాస్త్రవేత్త ఓంప్రకాశ్

- కేవీకే ప్రధాన శాస్త్రవేత్త రత్నకుమార్

రాయపర్తి : పంటల సాగులో ఎరువుల వినియోగాన్ని తగ్గించి సేంద్రియ విధానంలో పంటలు సాగిస్తే అధిక దిగుబడి వస్తుందని మామునూర్ కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే) పరిశోధన సంస్థ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ రత్నకుమార్ తెలిపారు. మండలంలోని సన్నూరు, కేశవాపురం, కొండాపురం, కొండూరు, కొలన్‌పల్లి, పోతిరెడ్డిపల్లి గ్రామాల్లో శుక్రవారం నిర్వహించిన 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు, వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్' కార్యక్రమాలకు ఆయన అతిథిగా హాజరై మాట్లాడారు. జీలుగ, పిల్లిపెసర, పెసర్లు, బొబ్బర్లు, మినుములు వేసుకుని పప్పు దినుసులు పండించడంతోపాటు భూమిని కలియదున్నితే నేల సారవంతం అవుతుందని చెప్పారు. జాతీయ ఆహార భద్రత కమిషన్ కన్సల్టెంట్ సారంగపాణి మాట్లాడుతూ అవసరం మేరకు మాత్రమే రసాయనాలను వినియోగించాలని సూచించారు. వరి పంటలో కేవలం 100 కిలోల యూరియా, 50 కిలోల డీఏపీ, 25 కిలోల పొటాష్ వినియోగించాలని చెప్పారు. తద్వారా సాగు పెట్టుబడి తగ్గి నేల, నీరు, వాతావరణ కాలుష్యాన్ని సైతం నివారించవచ్చని తెలిపారు. సిఫార్సు మేరకే గడ్డిమందు, తెగులు మందు పిచికారి చేయాలన్నారు. కార్యక్రమాల్లో మండల వ్యవసాయ అధికారి గుమ్మడి వీరభద్రం, శాస్త్రవేత్తలు గణేశ్, హరి, మధు, రాములు, ప్రశాంత్, ఏఈఓలు సాయి, మనస్విని, కావ్య, తదితరులు పాల్గొన్నారు.

మేలైన విత్తనాలు ఎంచుకోవాలి

ఖానాపురం : రైతులు మేలైన విత్తనాలు ఎంచుకోవాలని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం (ఆర్ఏఆర్ఎస్) కీటక విభాగ శాస్త్రవేత్త ఓంప్రకాశ్, సేద్య విభాగ శాస్త్రవేత్త మాధవి కోరారు. మండలంలోని రాగంపేటలో నిర్వహించిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. సమగ్ర పంట విధానాన్ని వివరించాలి. భూసారాన్ని, పర్యావరణాన్ని పరిరక్షిస్తూ పంటలు సాగు చేయాలని చెప్పారు. సేంద్రీయ ఎరువులను వినియోగిస్తూ విషరహిత పంటలు సాగు చేయాలని, అధిక దిగుబడులు సాధించాలని తెలిపారు. పంట మార్పిడి, సుస్థిర వ్యవసాయ విధానాన్ని రైతులు అలవర్చుకోవాలని ఆకాంక్షించారు. సమావేశంలో వ్యవసాయ అధికారి బోగ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

గౌడ కులస్తులు ఉన్నతంగా ఎదగాలి



అవార్డు అందుకున్న విద్యార్థులతో సాంబయ్య, తదితరులు

- గోపా జిల్లా కమిటీ ప్రతినిధి సాంబయ్య

సంగెం : గౌడ కులస్తులు ఉన్నతంగా ఎదగాలని గౌడ అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (గోపా) జిల్లా కమిటీ ప్రతినిధి గునిగంటి సాంబయ్య కోరారు. పదో తరగతి, ఇంటర్మీడియెట్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన మండలానికి చెందిన గౌడ కుల విద్యార్థులకు అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రతిభ అవార్డు అందజేశారు. ఈ సందర్భంగా సాంబయ్య మాట్లాడారు. విద్యతోనే విలువలు పెరుగుతాయని, ఉన్నత స్థాయికి చేరుకోగలరని చెప్పారు. మరింత క్రమశిక్షణ, పట్టుదలతో చదువుకుని ఉత్తమ పౌరులుగా స్థిరపడి సమాజ సేవలో పాలుపంచుకోవాలని కోరారు. ఎన్ని సమస్యలు ఎదురైనా తల్లిదండ్రులు పిల్లలను ఉన్నతంగా చదివించాలని సూచించారు. ప్రతిభావంతులను, పేద కులస్తులను ఆదుకోవడంలో అసోసియేషన్ ముందుంటుందని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు గుళ్లపల్లి ఉమేందర్, కక్కెర్ల శరత్‌బాబు, ఆగపాటి రాజు, పులి రాజశేఖర్, కోడూరి వెంకట్, గొడిశాల జీవన్, చెరుకు యాదగిరి, కత్తి రమేశ్, వెంకన్న, శ్రీనివాస్, సతీశ్, తదితరులు పాల్గొన్నారు.

'బడిబాట'



వర్ధన్నపేట : మండలంలోని కొత్తపల్లిలో ల్యాబర్తి జెడ్పీ హైస్కూల్ ఉపాధ్యాయులు శుక్రవారం బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలు, రైతుల వద్దకు వెళ్లి పాఠశాలలో లభిస్తున్న సదుపాయాలు వివరించారు. పిల్లలను ప్రభుత్వ స్కూల్‌లో చేర్పించాలని సూచించారు. రెండు దశాబ్దాలకుపైగా అనుభవం కలిగిన ఉపాధ్యాయులు బోధిస్తుండడంతో 100 శాతం ఫలితాలు సాధిస్తూ మండలంలో ద్వితీయ స్థానంలో నిలిచినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు భూక్య హరిలాల్, నాగరాజు, రఘువీర్, మాధురి, ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

'ఎమ్మెల్యే చొరవతోనే ఇంటిగ్రేటెడ్ స్కూల్ మంజూరు'

వర్ధన్నపేట : స్థానిక ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు చొరవ తీసుకోవడం వల్లే నియోజకవర్గానికి ఇంటిగ్రేటెడ్ స్కూల్ మంజూరైందని యూత్ కాంగ్రెస్ జిల్లా నాయకుడు బిర్రు రాజు తెలిపారు. పట్టణంలోని శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వాలు నియోజకవర్గ అభివృద్ధిని విస్మరించాయని తెలిపారు. పేద విద్యార్థులకు అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన విద్య అందించేలా రూ.200 కోట్ల వ్యయంతో తలపెట్టిన స్కూల్ మంజూరు చేయించే దిశగా ఎమ్మెల్యే కృషి చేశారని చెప్పారు. నియోజకవర్గ పేద విద్యార్థులు అంతర్జాతీయ స్థాయి విద్య అందుకోనున్నారని హర్షం వ్యక్తం చేశారు.

పౌరహక్కుల పరిరక్షణ సామాజిక బాధ్యత

- ఎస్సై ప్రశాంత్ బాబు

గీసుకొండ : పౌరహక్కుల పరిరక్షణను సామాజిక బాధ్యతగా స్థానిక ఎస్సై ప్రశాంత్ బాబు అభివర్ణించారు. గ్రేటర్ వరంగల్ నగర పరిధిలోని 15వ డివిజన్ గొర్రెకుంటలో శుక్రవారం నిర్వహించిన పౌరహక్కుల దినోత్సవ కార్యక్రమానికి ఆయన అతిథిగా హాజరై మాట్లాడారు. సమాజంలోని ప్రతిఒక్కరికీ హక్కుల ఉంటాయని చెప్పారు. ప్రజలు హక్కులు, బాధ్యతల గురించి అవగాహన పెంచుకోవాలని సూచించారు. పౌరహక్కులను ఎవరైనా ఉల్లంఘిస్తే చట్టరీత్యా కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్, విజిలెన్స్ కమిటీ జిల్లా సభ్యుడు నమిండ్ల చిన్నస్వామి మాట్లాడుతూ యువత వ్యసనాలకు దూరంగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో ఆర్ఐ శ్రీధర్, ఎక్సైజ్ ఎస్సై జ్యోతి, మెడికల్ ఆఫీసర్ అరుణ్‌కుమార్, మున్సిపల్ ఆర్ఓ శ్రీనివాస్, ఆర్ఐ సునీల్, అంబేడ్కర్ యువజన సంఘం జిల్లా కార్యదర్శి బందెల అరుణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న చిన్నస్వామి

ప్రభుత్వ స్కూళ్లలోనే మెరుగైన బోధన



పర్వతగిరి : మాట్లాడుతున్న హెచ్‌ఎం రమేశ్



రాయపర్తి : మాట్లాడుతున్న ఉపాధ్యాయురాలు

- జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం రమేశ్‌బాబు

పర్వతగిరి : ప్రభుత్వ స్కూళ్లలోనే మెరుగైన విద్యాబోధన అందుతోందని మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు (హెచ్‌ఎం) పాక రమేశ్ బాబు తెలిపారు. ఆ స్కూల్‌లో శుక్రవారం నిర్వహించిన తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ స్కూళ్లలో అన్ని మౌలిక వసతులు ఉన్నాయని, ఉన్నత విద్యార్హతలతోపాటు అపార అనుభవం కలిగిన ఉపాధ్యాయులు తరగతులు బోధిస్తున్నారని చెప్పారు. ఉచితంగా పుస్తకాలు, మధ్యాహ్న భోజనం, తదితర సదుపాయాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ ఏడాది నుంచి డిజిటల్ విద్యాబోధన అందుబాటులోకి రానుందన్నారు. విద్యార్థులు చదువుల్లోనే కాకుండా ఆటపాటల్లోనూ రాణించేలా చొరవ తీసుకుంటున్నట్లు వివరించారు. ప్రజలు పిల్లలను ప్రభుత్వ స్కూళ్లలో చేర్చేలా తల్లిదండ్రులు, యువజన సంఘాలు చొరవ చూపాలని కోరారు. సమావేశంలో ఉపాధ్యాయులు కె.శ్రీధర్, బైరి తిరుపతి, అయిత రమేశ్, శాంతికిరణ్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల సంఖ్య పెరగాలి

రాయపర్తి : మండల కేంద్రంలోని ప్రభుత్వ హైస్కూల్‌లో విద్యార్థుల సంఖ్య పెరగాలని ఆ స్కూల్ సీనియర్ ఉపాధ్యాయురాలు సునీత ఆకాంక్షించారు. ఆ స్కూల్‌లో ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులతో నిర్వహించిన 'పేరెంట్–టీచర్ మీట్'లో ఆమె మాట్లాడారు. ప్రభుత్వ స్కూళ్లలో కార్పొరేట్ విద్యాసంస్థలకు దీటుగా బోధన అందుతోందని, సదుపాయాలున్నాయని చెప్పారు. తల్లిదండ్రులు పిల్లలను ప్రభుత్వ స్కూళ్లలో చేర్చి అవకాశాలను వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎస్‌వీబీ.శర్మ, ప్రవీణ్‌రెడ్డి, రోజారాణి, రాధ, సురేందర్, నర్సింహులు, స్వామి, సంధ్య, యోగశ్రీ, ఉమాదేవి, శోభ, విజయ, సీఆర్‌పీ రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

3న కలెక్టరేట్ ఎదుట ధర్నా

- రైతు సంఘం ప్రధాన కార్యదర్శి బాబు

నర్సంపేట : రైతులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి జూన్ 3న కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించనున్నట్లు రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఈసంపెల్లి బాబు తెలిపారు. పట్టణంలోని ఆ సంఘం కార్యాలయంలో ధర్నా పోస్టర్లను శుక్రవారం ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం రైతుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని చెప్పారు. ఎన్నికల ముందు ఇచ్చిన రైతు భరోసా, ఇతర హామీల అమలులో విఫలమైందని తెలిపారు. వెంటనే రైతు భరోసా డబ్బులు రైతుల ఖాతాలో జమ చేయాలని కోరారు. పత్తి, మొక్కజొన్న వంటి పంటలకు బోనస్ ఇస్తామన్న హామీని సైతం విస్మరించారని తెలిపారు. ప్రభుత్వం వెంటనే రైతులకు ఇచ్చిన హామీలను అమలు



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న బాబు, నాయకులు

చేయాలని డిమాండ్ చేశారు. కలెక్టరేట్ ఎదుట తలపెట్టిన ధర్నాకు మండలంలోని అన్ని గ్రామాల నుంచి రైతులు హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు కోరబోయిన కుమారస్వామి, జిల్లా కమిటీ సభ్యులు కట్కూరి శ్రీనివాసరెడ్డి, కొలువుల శివ, హన్మకొండ సంజీవ, పస్తం ఎల్లయ్య, గణిపాక ప్రశాంత్, గట్ల నర్సింహరాములు, జగన్నాథం, కార్తీక్, సతీశ్, తదితరులు పాల్గొన్నారు.

సీనియర్ జర్నలిస్టు మృతి



వీరస్వామి (ఫైల్)

దుగ్గొండి : మండల కేంద్రానికి చెందిన సీనియర్ జర్నలిస్టు బైగాని వీరస్వామి (74) అనారోగ్యంతో బాధపడుతూ పరిస్థితి విషమించి శుక్రవారం సాయంత్రం మృతి చెందాడు. ఆయన ఓ ప్రధాన తెలుగు పత్రికలో సుమారు 36 ఏళ్లుగా విలేకరిగా సేవలు అందించిన క్రమంలో ఆయన మృతితో మండలంలో విషాదం నెలకొంది. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలున్నారు. వీరస్వామి కుమారుడు రఘును అమెరికా పర్యటనలో ఉన్న నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి ఫోన్‌లో పరామర్శించారు. వీరస్వామితో తనకున్న నాలుగు దశాబ్దాల అనుబంధం మరవలేనిదని చెప్పారు. వీరస్వామి మృతదేహానికి నర్సంపేట బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తోకల శ్రీనివాసరెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఎర్రల్ల బాబు, వర్కింగ్ ప్రెసిడెంట్ ఒలిగె నర్సింగరావు, తదితరులు నివాళులర్పించారు.

'ఉపాధి' కూలీల సమస్యలు పరిష్కరించాలి

- సంఘం జిల్లా కార్యదర్శి సమ్మయ్య

నర్సంపేట : ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న కూలీల సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి భూక్య సమ్మయ్య డిమాండ్ చేశారు. ఆయన ఆధ్వర్యంలోని బృందం ఆర్డీఓ కార్యాలయ అధికారికి శుక్రవారం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేసింది. అనంతరం సమ్మయ్య మాట్లాడారు. ఉపాధి హామీ పథకానికి బడ్జెట్‌లో నిధులు తగ్గిస్తూ నిర్వీర్యానికి కేంద్ర ప్రభుత్వం కుట్ర చేస్తోందని విమర్శించారు. ఏటా వంద రోజుల పని కల్పించాల్సి ఉండగా కనీసం 30 రోజులు కూడా సక్రమంగా చూపించడం లేదన్నారు. కూలీలందరికి పనులు కల్పించే దిశగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు చేపట్టడం లేదని తెలిపారు. ఫీల్డ్ అసిస్టెంట్లు సకాలంలో వేతనాలు అందక ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. ఉపాధి హామీ కూలీలకు



వినతిపత్రం ఇస్తున్న సమ్మయ్య, నాయకులు

పూర్తి స్థాయిలో పనులు కల్పించడంతోపాటు ఎప్పటికప్పుడు కూలి చెల్లించాలని, ఫీల్డ్ అసిస్టెంట్లను రెగ్యూలర్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు నమిండ్ల స్వామి, ఉపాధ్యక్షుడు బోళ్ల సాంబయ్య, నాయకులు పుచ్చకాయల నర్సింహారెడ్డి, ఇస్లావత్ రవి, పెండ్యాల సారయ్య, బస్కె మొగిలి, నీరటి బాలకొమురు, జన్ను అశోక్, రాజు, తదితరులు పాల్గొన్నారు.

ర్యాలీని జయప్రదం చేయాలి

ఆత్మకూరు : నేడు వరంగల్ రైల్వే స్టేషన్ నుంచి కాళోజీ కళాక్షేత్రం వరకు నిర్వహించనున్న ఎమ్మార్పీఎస్ ర్యాలీని జయప్రదం చేయాలని రాష్ట్ర కార్యదర్శి మురళి కోరారు. మండలంలోని నీరుకుళ్లలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పద్మశ్రీ అవార్డు స్వీకరించిన అనంతరం తొలిసారి వరంగల్‌కు వస్తున్న మంద కృష్ణకు ఘనస్వాగతం పలకాలన్నారు. అదే రోజు జరగనున్న సభను విజయవంతం చేయాలని కోరారు.

'ఆపరేషన్ కగార్'ను నిలిపేయాలి

- ఎంసీపీఐ(యూ) జిల్లా కార్యదర్శి రమేశ్

నర్సంపేట : కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ కగార్‌ను నిలిపేయాలని ఎంసీపీఐ(యూ) జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేశ్ డిమాండ్ చేశారు. ఆ పార్టీ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో పట్టణంలోని అంగడి సెంటర్‌లో పార్టీ వ్యవస్థాపకుడు, మాజీ ఎమ్మెల్యే మద్దికాయల ఓంకార్ విగ్రహం వద్ద శుక్రవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రమేశ్ మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం నియంతృత్వ విధానాలతో ఆదివాసీ గిరిజనులపై దాడులకు ఆల్పడుతోందని విమర్శించారు. మావోయిస్టుల కాల్చివేత సమంజసం కాదన్నారు. మావోయిస్టులతో చర్చలు జరిపి దేశంలో శాంతి నెలకొల్పాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పార్టీ డివిజన్ కార్యదర్శి మహ్మద్ రాజా, యూపీఎస్ఎం రాష్ట్ర కార్యదర్శి కన్నం వెంకన్న, రాష్ట్ర కమిటీ సభ్యుడు కుసుంబ బాబురావు, సీనియర్ నాయకులు నాగెల్లి కొమురయ్య, మల్లికార్జున్, తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న రమేశ్, నాయకులు

'గురుకులాల సెక్రటరీ వ్యాఖ్యలు సరికాదు'

నర్సంపేట : గురుకుల విద్యార్థులను ఉద్దేశించి తెలంగాణ సోషల్ వెల్ఫేర్ గురుకుల స్కూళ్లు, కళాశాలల సెక్రటరీ అలుగు వర్షిని చేసిన వ్యాఖ్యలు సరికాదని ఏబీఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బొట్ల నరేశ్, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు దిడ్డి పార్థసారథి, ఏఐఎఫ్‌డీఎస్ జిల్లా కార్యదర్శి మార్త నాగరాజు తెలిపారు. ఆయా సంఘాల ఆధ్వర్యంలో పట్టణంలోని ద్వారకపేట రోడ్డు కూడలిలో శుక్రవారం రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా నరేశ్, పార్థసారథి, నాగరాజు మాట్లాడారు. వర్షిని వ్యాఖ్యలను ఖండించారు. విద్యార్థులు టాయిలెట్లు కడిగితే తప్పేంటన్న వ్యాఖ్యలు ఖండించారు. విద్యార్థులతో పనులు చేయిస్తే వారి చదువులు వెనకబడిపోతాయని ఆందోళన వెలిబుచ్చారు.

ఆలయ నిర్మాణానికి సహకరిస్తా

రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ

ఆత్మకూరు : గౌడ కులస్తుల ఆరాధ్య దైవం ఆదిపరాశక్తి అంశతో జన్మించిన రేణుకా ఎల్లమ్మ ఆలయ నిర్మాణానికి సహాయ, సహకారాలు అందిస్తానని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ స్పష్టం చేశారు. శుక్రవారం మండల కేంద్రంలో గౌడ సంఘం కార్యాలయ ఆవరణలో నిర్మిస్తున్న రేణుకా ఎల్లమ్మ దేవాలయానికి కావాల్సిన నిధులు కేటాయించాలని గౌడ సంఘం కులస్తులు ఆమెను హనుమకొండలో మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రేణుకా ఎల్లమ్మ ఆలయ నిర్మాణానికి సహాయ, సహకారాలు అందిస్తానని భరోసా ఇచ్చారు. అమ్మవారి అనుగ్రహం ఉంటేనే ప్రజలందరూ సుఖ, సంతోషాలతో ఉంటారన్నారు. మండల కేంద్రంలో రేణుకా ఎల్లమ్మ దేవాలయం నిర్మాణం చేయడం అభినందనీయమని గౌడ సంఘం పెద్దలు అభినందించారు. చేసే ప్రతి పనిలో రాణించాలంటే దైవ అనుగ్రహం ఉంటేనే సాధ్యమవుతుందన్నారు. దేవాలయ నిర్మాణం చేసి నిత్య పూజలు జరిగే విధంగా చూడాలని గౌడ సంఘంపెద్దలకు మంత్రి సూచించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పర్వతగిరి రాజు, గౌడ సంఘం పెద్దలు పాగాకుల కొమురయ్యగౌడ్, గుర్రం ప్రభాకర్‌గౌడ్, పాగాకుల రమేశ్‌గౌడ్, భయగాని రమేశ్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.



మంత్రి సురేఖకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

అలరిస్తున్న చిందు యక్షగానం

వర్ధన్నపేట : పట్టణంలోని 10వ వార్డులో గజవెల్లి వెంకన్న బృందం శుక్రవారం ప్రదర్శించిన చిందు యక్షగానం స్థానికులను అలరించింది. కళాకారులు 'సతీ తులసి' నాటిక ప్రదర్శించగా ప్రేక్షకులు మంత్రముగ్ధులై తిలకించారు. నాటికలోని పాత్రదారుల హావభావాలు, సన్నివేశాలు, యక్షగానం ప్రేక్షకులను ఆకట్టుకుంది. కార్యక్రమంలో కళాకారులు అయిత యాకాంతం, హన్మకొండ లక్ష్మి, కె.రమేశ్, కె.కుమార్, దూడయ్య, యాకూబ్, తదితరులు పాల్గొన్నారు.



నాటకాన్ని ప్రదర్శిస్తున్న కళాకారులు